ప్రజాశక్తి

మంగళవారం జనవరి 14 2025 8 పేజీలు

శ్రీకాకుళం





ఆ గ్రామాలు భోగికి దూరం

(...8లో)

ఊరంతా సంక్రాంతి

- పట్టణాలు, గ్రామాల్లో పండగ హడావుడి
- సందడి చేస్తున్న కళాకారులు
- పల్లెబాట పట్టిన పట్టణవాసులు
- కళకళలాడుతున్న మార్కెట్లు
- రద్దీగా మారిన రోడ్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



కిటకిటలాడుతున్న పొట్టిశ్రీరాములు మార్కెట్

తెలుగు వారు ఘనంగా జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో ఒకటైన సంక్రాంతి రానే వచ్చింది. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా పెద్ద పండుగను అన్ని తరగతుల ప్రజలు కుటుంబాలతో కలిసి చేసుకోవడంతో పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ఎక్కడ చూసినా సంక్రాంతి సందడి కనిపిస్తుంది. దూర ప్రాంతాల్లో నివసించే వారు స్వస్థలాలకు చేరుకున్నారు. దీంతో పల్లెలు, పట్టణాల్లో పండగ సందడి పతాకస్థాయికి చేరింది.

సంక్రాంతి పండగకు ఎక్కడెక్కడో ఉన్న వారు స్వగ్రామాలకు చేరుకున్నారు. గ్రామాలు, పట్టణాల్లో సంక్రాంతికి శోభను తీసుకొచ్చే హరిదాసులు, గంగిరెద్దులు, చెంచులు, బుడగజంగాలు, డప్పు వాయిద్య కళాకారులు హడావుడి చేస్తున్నారు. జానపద కళాకారుల ఆటపాటలు సంక్రాంతికి మరింత వన్నె తెచ్చి పెట్టింది. నిరుపేదలకు పలువురు దాతలు వ్యక్తిగతంగానే కాకుండా సంస్థలు, సంక్షేమ సంఘాల తరపున వస్త్ర దానాలు వంటి కార్యక్రమాలను కూడా పండగ సందర్భంగా నిర్వహిస్తున్నారు.

(మిగతా...2లో)



పలాస : భోగి మంటల్లో బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు

- విద్యుత్ ఛార్జీల పెంపుపై సిపిఎం నిరసన
- ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారం
- స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలి
- సిపిఎం నాయకుల పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టిడిపి కూటమి ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా సిపిఎం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జిల్లాలోని పలుచోట్ల భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి (మిగతా...2లో)





మాజీ ఎంపీ 'పాలవలస' మృతి

రాజశేఖరం మృతిపై పలువురు సంతాపం

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

మాజీ రాజ్యసభ సభ్యులు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వైసిపి సీనియర్ నేత పాలవలస రాజశేఖరం (81) సోమవారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఇందుమతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు విక్రాంత్ ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. కుమార్తె రెడ్డి శాంతి మాజీ ఎమ్మెల్యే. ఇందుమతి ప్రస్తుతం ఉమ్మడి జిల్లా రేగిడి జెడ్‌పిటిసిగా ఉన్నారు. రాజశేఖరం పాలకొండ నగర పంచాయతీ యాలాం సెంటర్‌లో నివాసం ఉంటున్నారు. వీరఘట్టం మండలం (మిగతా...2లో)





కళలను భావితరాలకు అందించాలి


కళాకారుల ప్రదర్శన

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

మరుగున పడిన కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పలువురు వక్తలు అన్నారు. నగరంపల్లిలో ప్రజానాట్యమండలి, గిడుగు రామ్మూర్తి జానపద కళాపీఠం సంయుక్తంగా నిర్వహించిన జానపద కళామేళా ఆద్యంతం చూపరులను ఆకట్టుకుంది. అసిరయ్య జానపద ప్రదర్శన, జముకుల పాట, గిడుగు రామ్మూర్తి జానపద కళాపీఠం వ్యవస్థాపకులు, రచయిత బద్రి కుర్మారావు పల్లె పాటలతో అలరించారు. జానపద కళాకారుడు కొండ శ్రీధర్ ఆలపించిన లయబద్ధమైన పాటలతో హోరెత్తించారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు ఈశ్వర్ పాత్రో ప్రదర్శన ఆద్యంతమూ ఆకట్టుకుంది. ఆసిరయ్య కళాపీఠం ఏర్పాటు చేసి ఆయన సేవలను ఉత్తరాంధ్ర అంతటా ఉపయోగించుకుంటామని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ హనుమంతు లజపతిరాయ్ తెలిపారు. భావితరాలకు మన యాస, భాష, ఆట, పాట ద్వారా నైతిక విలువలను పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు నెయ్యల చంద్రయ్య, శిష్టు మనోజ్, సినీ, నాటక, రంగస్థల కళాకారుడు కుమార్ నాయక్, సర్పంచ్ దువ్వాడ మధుకేశ్వరరావు, మాజీ సర్పంచ్ దువ్వాడ జయరాం చౌదరి, సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, నెయ్యల మోహనరావు, ఎంపిటిసి బమ్మిడి మోహనరావు, ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.రమణ, జిల్లా కన్వీనర్ వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

నీరు విడుదల చేయాలి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రబీ సీజన్‌లో భాగంగా నీటిని సద్వినియోగం చేసుకునే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సంబంధిత అధికారులకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నీటిపారుదల శాఖ అధికారులతో, వంశధార ఎస్ఇతో మాట్లాడారు. రబీ సీజన్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే నీరు విడుదల చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ రైతులకు ఉపయోగపడే విధంగా చేయాలని సూచించారు. తన స్వగ్రామం నిమ్మాడలో గ్రామస్తులతో సోమవారం కాసేపు ముచ్చటించారు. రైతులు ఆరుతడి పంటలకు అవసరమైన నీరును విడుదల చేయాలని వారంతా కోరారు. వెంటనే మంత్రి స్పందించి కలెక్టర్, నీటిపారుదల శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా తక్షణ కార్యాచరణ అమలు చేశారు. వంశధారలో ఉన్న ప్రస్తుత నీరు వృథాగా విడిచిపెట్టకుండా సద్వినియోగం చేసుకుందామని చెప్పారు. సాగు అవసరాలకు అనుగుణంగా నీటిని వినియోగించుకోవాలని, ఆ విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మార్గనిర్దేశం చేశారు.


ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

పండగ వేళలో నిర్మానుష్యమైన ప్రదేశాలు, తోటల్లో జూదం, కోడిపందేలు ఆడే వారు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి వినియోగానికి శ్రీకాకుళం రూరల్ మండలం, నగరంలోని శివారు ప్రాంతాల్లో అనుకూలంగా ఉండే ప్రదేశాలపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. బహిరంగంగా మద్యం సేవించడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, గంజాయి వినియోగించిన వారిపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సానివాడ, ఒప్పంగి, పొన్నాం, బట్టేరు, జాతీయ రహదారికి ఇరువైపులా శ్రీకాకుళం గ్రామీణ ప్రదేశాలతో పాటుగా ఆయా పరిసర ప్రదేశాల్లో పాడుపడిపోయిన బంగ్లాలు, తోటలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపట్టారు. బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగించినా, పేకాట, ఈవ్ టీజింగ్ తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారు పట్టుబడినట్లయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శ్రీకాకుళం పట్టణం డ్రోన్ కెమెరాల నిఘా నీడలో ఉందని, సంక్రాంతి పండగ దృష్ట్యా ప్రజలు కుటుంబసభ్యులతో ఆనందంగా పండగ చేసుకోవాలన్నారు. ఎటువంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్ నిఘా

ప్రముఖుల సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా ప్రజలకు పలువురు ప్రముఖులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో సంక్రాంతిని ఆనందంగా చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందుతుండడంతో నూతన సంవత్సర ఆరంభానికి ముందే రాష్ట్రంలోని ప్రతి లోగిళ్లలో సంక్రాంతి కళ సంతరించుకుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సంక్రాంతి సకల శుభాలు తేవాలని, సౌభ్రాతృత్వం, సౌభాగ్యం వెల్లివిరియాలని కోరుకుంటున్నట్లు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆనందంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆకాంక్షించారు. కొత్త పంట ఇంటికి వచ్చిన అనంతరం చేసుకునే పెద్ద పండగ సంక్రాంతి అని పేర్కొన్నారు. సంక్రాంతి ప్రతి ఇంటా ఆనందపరవశం కావాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆకాంక్షించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండగ నిలుస్తుందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఊరంతా సంక్రాంతి

వస్త్ర దుకాణాల వ్యాపారాలు ఈ ఏడాది పండగ కళను సంతరించుకున్నాయి. కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకూ వస్త్రాల కొనుగోలుతో దుకాణాల్లో రద్దీ నెలకొంది. డిమాండ్‌కు తగ్గట్టుగా తగినట్లే వస్త్ర వ్యాపారులు రకరకాల డిజైన్లను అందుబాటులోకి తెచ్చారు. వస్త్ర వ్యాపారులు అక్టోబరు నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు కొనుగోలు చేసేందుకు వెళ్లడం ప్రారంభిస్తారు. నవంబరు నెలాఖరు నాటికి పలురకాల వస్త్రాలను తెప్పిస్తారు. శ్రీకాకుళం నగరంలో చిన్నాపెద్దా అన్నీ కలిపి 200కు పైగా వస్త్ర దుకాణాలు ఉన్నాయి. ఇవి కాకుండా ఆన్‌లైన్ వస్త్ర వ్యాపారం కూడా విస్తృతంగా సాగుతోంది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఈ ఏడాది క్రిస్మస్ నుంచి ఈ వ్యాపారం ఊపందుకుంది. సంక్రాంతి వరకూ వస్త్ర దుకాణాలన్నీ జన సందడితో కళకళలాడుతున్నాయి. స్థానికులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారితో జిల్లా కేంద్రంలోని జి.టి రోడ్డు, పాలకొండ రోడ్డు, కళింగ రోడ్డు, డేఅండ్‌నైట్, సూర్యమహల్ కూడలి వద్ద జన సందడి నెలకొంది. మరోవైపు పండగకు అవసరమైన సరుకులను కొనుగోలు చేసేందుకు వచ్చిన జనాలతో పొట్టి శ్రీరాములు మార్కెట్, రైతుబజారు కిటకిటలాడింది. పండగ నేపథ్యంలో నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరిగాయి.

టిక్కెట్ల కోసం థియేటర్ల వద్ద పడిగాపులు

ఇదే సందర్భంలో వరుసగా కొత్త సినిమాలు విడుదల కావడంతో వాటికి డిమాండ్ నెలకొంది. టిక్కెట్ల కోసం థియేటర్ల వద్ద క్యూ కడుతున్నారు. పండగ రోజుల్లో ఇంటిల్లిపాది సినిమాలు తిలకించేందుకు టిక్కెట్లను అడ్వాన్స్ బుకింగ్ చేసేసుకుంటున్నారు. గేమ్‌ఛేంజర్, డాకూ మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలు విడుదల కావడంతో వాటిని తిలకించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

గ్రామాల బాట పట్టిన వలసవాసులు

ఉపాధి కోసం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు వెళ్లిన వారంతా సంక్రాంతి నేపథ్యంలో తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారు. ఇప్పటికే కొందరు స్వస్థలాలకు చేరుకోగా, మరికొందరు సంక్రాంతి పండగ రోజుకు చేరుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది. పండగ నేపథ్యంలో బస్సులు, రైళ్లు అన్నీ రద్దీగా ఉన్నాయి. గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో సొంత వాహనాలపైనే ప్రయాణాలను సాగించేందుకే ఎక్కువగా ప్రజలు మొగ్గు చూపుతున్నారు.

మాజీ ఎంపీ 'పాలవలస' మృతి

నీలానగరం గ్రామ సర్పంచ్ స్థాయి నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన

మొదటి పేజీ తరువాయి

పార్లమెంటు సభ్యుని స్థాయి వరకు చేరారు. నీలానగరం సర్పంచిగా 1970-74 మధ్య పనిచేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన శ్రీకాకుళం, విజయనగరం ఉమ్మడి జిల్లాల జిల్లాపరిషత్ ఛైర్మన్‌గా 1974 నుంచి 1976 వరకు పనిచేశారు. 1976 నుంచి రాజ్యసభ సభ్యునిగా పనిచేశారు. 1992-94 మధ్యకాలంలో డిసిసిబి అధ్యక్షునిగా పనిచేశారు. 1994 అసెంబ్లీ ఎన్నికల్లో ఉణుకూరు శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి కిమిడి కళా వెంకటరావుపై గెలుపొందారు. 2006 నుంచి 2011 వరకు శ్రీకాకుళం జిల్లాపరిషత్ అధ్యక్షునిగా సేవలందించారు. 2011 జూన్‌లో తన అనుచరులతో కలిసి వైసిపిలో చేరారు. ఆయన అంత్యక్రియలు ఈనెల 15వ తేదీన పాలకొండలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు

సోమవారం నిరసన తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఇందిరానగర్ కాలనీలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు మాట్లాడుతూ విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని, విద్యుత్ ఛార్జీల పెంపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ప్రభుత్వ కార్యాలయాల్లో ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించిందని... ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా వినియోగదారులందరికీ స్మార్ట్ మీటర్లు అమరుస్తున్నారని చెప్పారు. నివాసాలకు, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోందన్నారు. వైసిపి ప్రభుత్వం పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించినపుడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, జనసేన పార్టీలు వ్యతిరేకించాయని, మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చిన నాయకులే ఇప్పుడు అనుమతులు ఇస్తున్నారన్నారని విమర్శించారు. ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్ల వల్ల ప్రజలపై పెద్దఎత్తున భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మీటర్ల వల్ల ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జి చేయించుకోవాలని, బ్యాలెన్స్ పూర్తి కాగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. దీనివల్ల పేదలకు అంధకారం మిగులుతుందన్నారు. దీనికితోడు మీటర్ల భారాన్ని 96 నెలల పాటు వినియోగదారుడే చెల్లించాల్సి వస్తుందన్నారు. రాత్రి వేళల్లో అధిక వినియోగానికి అధిక ధరలు వసూలు చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి భయపడి నాడు వైసిపి, నేడు టిడిపి, జనసేన పార్టీలు ఈ మీటర్లను కొనసాగించడం అన్యాయమన్నారు. వెంటనే విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.ప్రకాష్, ఎల్.మహేష్, శ్రీను, చిన్నారావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, శంకర్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

చలికాలంలో విద్యుత్ ధరలు పెంచి రాష్ట్ర ప్రభుత్వం చెమటలు పట్టిస్తోందని పలు ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు. నగరంలోని కత్తెర వీధిలో నిర్వహించిన భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన చేట్టారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు కె.శ్రీనివాసు మాట్లాడుతూ ట్రూఅప్ ఛార్జీల పేరుతో 2014 నుంచి ప్రజల విద్యుత్ వాడకానికి బకాయిలు వసూలు చేయాలని డిస్కంలకు అనుమతిచ్చి, విద్యుత్ బాదుడుకు కూటమి ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. మరోవైపు స్మార్ట్‌మీటర్లు, టైమ్ ఆఫ్ డే ధరలు, సుంకాలు, కస్టమర్ ఛార్జీల పేరుతో పలురూపాల్లో ప్రజలను దోపిడీ చేస్తోందన్నారు. లంచాలు మరిగిన నేతలు అవినీతికి పాల్పడి ఎక్కువ ధరలకు పిపిఎలు చేసుకొని కార్పొరేట్లకు లాభం చేకూరుస్తూ, వినియోగదారులకు భారం మోపే విధానాన్ని అనుసరిస్తున్నారని విమర్శించారు. అవినీతికర అదానీ, సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నాయకులు కె.నాగమణి, వి.జి.కె మూర్తి, పి.సుధాకర్, ఎస్.భాస్కరరావు, ఎ.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని మాకన్నపల్లిలో ప్రజలతో కలిసి భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి, టి.అజయ్ కుమార్, టి.అప్పలస్వామి, టి.రాజు, జి.నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి పట్టణ కేంద్రంలోని ఎన్‌టిఆర్ కాలనీ, ఆదిఆంధ్రావీధిలో విద్యుత్ బిల్లులను దహనం చేసిన నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, ఉర్జాన దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని మామిడిపల్లిలో విద్యుత్ బిల్లుల దహన కార్యక్రమంలో సిపిఎం నాయకులు జుత్తు సింహాచలం, తెప్పల పాపారావు, గొరకల లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని పూజారిపేటలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : భోగి మంటల్లో బిల్లులు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

ఘనంగా భోగి



పొందూరు : భోగి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మండలంలోని స్వగ్రామం పెనుబర్తిలో సోమవారం నిర్వహించిన భోగి వేడుకల్లో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. ఉదయం వేకువజామునే కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేసి ఆనందంగా గడిపారు. మండలంలోని పొందూరు, రాపాక, కోటిపల్లి, వి.ఆర్.గూడెం, దల్లవలస, కింతలి, తోలాపి, కనిమెట్ట, లోలుగు, కృష్ణాపురం, నందివాడ, బురిడికంచరాం, తండ్యాం, మలకాం గ్రామాల్లో పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి సందడి చేశారు. భోగి మంటలలో నీళ్లను మరగబెట్టి స్నానాలు చేశారు.

మెళియాపుట్టి : సంక్రాంతి వేడుకలు సందర్భంగా పల్లెలన్నీ కళకళలాడుతున్నాయి. ఉపాధి కోసం పట్టణాలకు వలసపోయిన ప్రజలు పండగ సందర్భంగా తిరిగి పల్లెల్లోకి చేరుకున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, యువకులు, నూతన వస్త్రాలు ధరించుకొని పండగతో పల్లెలు పులకరించుకుపోతున్నాయి. సోమవారం భోగి పండగను ఆనందోత్సవంతో గడిపారు. వెంకటాపురం, భరణికోట, పరశురాంపురం తదితర గ్రామాల్లో మేమే గుర్రం, గిరిజన నృత్యాలు కనిపించాయి.

రణస్థలం: మండలంలోని పలు గ్రామాల్లో భోగి పండగతో సందడి వాతావరణం నెలకొంది. చిన్నా, పెద్దా అందరూ ఉత్సాహంతో గడిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఉదయం వేళ గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలతో గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ సంక్రాంతి శోభకు మరింత వన్నెతెచ్చారు.

పాతపట్నం: మండలంని సీది హైస్కూల్‌లో పెద్దిసీది యూత్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన భోగి మంటను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వెలిగించారు. అనంతరం ముగ్గుల పోటీలకు రూ.30 వేలు ఆర్థికసాయం అందజేశారు. ముగ్గుల పోటీలో 85 పాల్గొన్నారు.

పలాస : పలాస ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే గౌతు శిరీష, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి భోగి పంగడ నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షులు తెలిపారు. ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, కొరికాన శంకర్, జోగ మల్లి పాల్గొన్నారు.

మండలంలోని బొడ్డపాడు, మాకన్నపల్లి, గురుదాసుపురం, మామిడిమెట్టు, నీలావతి పంచాయతీల్లో భోగి పండుగా ఘనంగా నిర్వహించారు. ముందుగా సుమ్మదేవి గ్రామంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుం లక్ష్మణ్‌కుమార్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావులు భోగి పండగను ప్రారంభించారు. అనంతరం మహిళలు, చిన్నారులు, యువత ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, రుమాల్, ఖోఖో తదితర ఆటలు ఆడుతూ గ్రామాల్లో సందడి చేశారు.



పాతపట్నం: భోగి మంట వేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు



పలాస : భోగి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష

గిరిజన గ్రామాల్లో...

మందస : మండలంలోని భావనాపురం పరిసర గ్రామాల్లో గిరిజనులకు పళ్లు, దుస్తులు, చాక్లెట్లను గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ పంపిణీ చేశారు. సంప్రదాయ, సంస్కృతి కొనసాగింపుగా సంక్రాంతి పండగ గిరిజన గ్రామాల్లో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు గవ్వ భీమారావు, అంబలి కృష్ణారావు, గిరిజన నాయకుడు సవర ధర్మారావు, ఉప సర్పంచ్ సవర గౌరి, ఉపాధ్యాయులు దాసరి శ్రీనివాసరావు, గ్రీన్ ఆర్మీ సభ్యులు కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి



కృష్ణారావు మృతదేహం

పాతపట్నం : పట్టణంలోని ఉప్పర వీధికి చెందిన రవ్వ కృష్ణారావు (57) ఆదివారం ఆత్మహత్యాయ త్నానికి పాల్పడి సోమవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పదే పదే సుగర్, బిపి తదితర వాటితో బాధపడుతున్నట్లు మానసికంగా వేధించారు. దీంతో కృష్ణారావు మనస్తాపానికి గురై ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంచుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడికి భార్య రవ్వ రోజా ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.లావణ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అప్పారావు మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

టెక్కలి రూరల్ : టెక్కలి మండలం కె.కొత్తూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ప్రయివేట్ ట్రావెల్స్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివారాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దసానకు చెందిన బందాపు అప్పారావు (48) బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. కె.కొత్తూరు వద్ద వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. విషయం వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతికి భార్య గీత, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో పండగ పూట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఎస్ఐ రాము కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

7 నుంచి శాలిహుండం యాత్ర

శ్రీకాకుళం అర్బన్ : గార మండలం శాలిహుండం కాళీయ మర్థన వేణుగోపాలస్వామి యాత్రి ఫిబ్రవరి 7 నుంచి 12 వరకు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలయాన్ని సమిష్టి కృషితో అభివృద్ధి చేస్తామని అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ నిచ్చారు. 12న వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి, టిడిపి నాయకులు కొంక్యాన ఆదినారాయణ పాల్గొన్నారు.

శివందగిరి కొండపై కనుమ జాతర

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని బెల్లుపడ వద్ద శివందగిరిపై భోగి పండగతో ప్రారంభించి మూడు రోజుల పాటు నిర్వహించే కనుమ ఉత్సవాలు అత్యంత ఘనంగ ప్రారంభించారు. సోమవారం బోగి సందర్భంగా కొండపై ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మహిళలు భారీగా తరలివచ్చారు. ఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు తిలకించడానికి భారీగా తరలివస్తున్నారు. కొండపై నుంచి ప్రకృతి సందర్శకులకు ఆహ్లాదం కలిగిస్తుంది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు దాతలు సహకారంతో ఆలయ అభివృద్ధి కమిటీ అన్ని ఏర్పాట్లు ఘనంగ నిర్వహించారు. సందర్శకులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ పోటీలో ప్రథమ బహుమతి కీళ్ల మోహిని, ద్వితీయ బహుమతి యు.కుమారి, తృతీయ మురపాల నీతు, నాలుగో బహుమతి పులి ధనలక్ష్మి, కన్సోలేషన్ నిషా విజేతలుగా నిలిచారు. విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అందజేశారు.



సైకిల్‌ను అందజేస్తున్న రాజ్యలక్ష్మి



గ్రామస్తులతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

సమస్యల పరిష్కారానికి కృషి

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడలో గ్రామస్తులతో సోమవారం ముచ్చటించి సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. భోగి పండగ వేళ కింజరాపు కుటుంబమంతా ఒకేచోట చేరి ఆనందాలను పంచుకున్నారు. రైతుల అభ్యున్నతికి తమ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈయన వెంట కింజరాపు హరివరప్రసాద్, గ్రామస్తులు ఉన్నారు.

11 మంది రక్తదానం

కవిటి: మండలంలోని బెలగాం ప్రభుత్వాస్పత్రి ఆవరణంలో డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉద్దానం బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 11 మంది సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకుడు

పూర్వ విద్యార్థుల కలయిక



శ్రీకాకుళం అర్బన్ : కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వారంతా వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. సంక్రాంతి వేళ పుట్టిన ఊరుకు చేరుకున్న వారంతా నగరంలోని ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థులు. ఆవరణలో సోమవారం వారంతా స్నేహ పూరిత వాతావరణంలో క్రికెట్ ఆట ఆడారు. రోజంతా ఆపాత మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. పూర్వ విద్యార్థుల్లో పశ్చిమ బెంగాల్ మాజీ డిజిపి మురళీధర్, రెవెన్యూ, వివిధ బ్యాంకులు, న్యాయశాఖ, మున్సిపల్ కార్పొరేషన్, ఛార్టర్ అకౌంటెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇలియాస్ అహ్మద్ మాట్లాడుతూ కీర్తిశేషులు ఓరుగంటి కమలాకర్ జ్ఞాపకార్థం ఈ ఏడాది క్రికెట్ టోర్నీ నిర్వహించినట్టు తెలిపారు. విశాఖపట్నం జిల్లా అదనపు ఎస్‌పి కుమార స్వామి, సామాజికవేత్త వండాన మురళీమోహన్, వి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఆర్.సి.రెడ్డి, ఎం.ఎన్.హుక్, డాక్టర్ ఎస్.రవి, రామ్మోహనరావు, అడపా మోహనరాజ్, ఖాన్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : ఆమదాలవలస గవర్నమెంట్ హైస్కూల్‌లో 1983-84 బ్యాచ్ ఎస్ఎస్‌సి విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. 1984లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ కలయిక పేరుతో కలిశారు. అప్పటి ఉపాధ్యాయులైన గురుగుబిల్లి గోవిందరావు, సత్యనారాయణ, బంగార్రాజు, వరదానందంలను ఘనంగా సన్మానించారు. సత్కార గ్రహీతలు మాట్లాడుతూ తమ విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నందుకు గర్వంగా ఉందని ప్రశంసించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు జలుమూరు రవిబాబు, రమేష్, సురేష్, గోపి, రామ్మూర్తి, అప్పలకొండ, రమణమూర్తి ఆధ్వర్యాన స్నేహితులందరూ పాత స్మృతులను గుర్తు తెచ్చుకుంటూ ఆనంద డోలికల్లో మునిగితేలారు. హాజరైన మిత్రులంతా తమవంతుగా సమాజానికి సేవ చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కష్టాల్లో ఉన్న తోటి స్నేహితుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అందరూ తీర్మానించారు. కార్యక్రమంలో సుమారుగా 80 మంది మిత్రులు పాల్గొన్నారు.



నందిగాం : కలుసుకున్న పూర్వ విద్యార్థులు



ఆమదాలవలస : కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నందిగాం : నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 2005-06 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ముందుగా పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. భోజన విరామం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఢిల్లేశ్వరరావు, అచ్యుతరావు, సుభాషిని, హేమలత, అరుణకుమారి, మోహనరావు, విద్యార్థులు మదన్ గౌడ, యు.రామారావు, చక్రధరరావు, కూర్మారావు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ లేక ఇబ్బందులు

ప్రజాశక్తి- రణస్థలం

బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రణస్థలం మండల కేంద్రంలో ఆర్‌టిసి బస్టాండ్ ఉంది. జాతీయ రహదారి ఆరులైన్ల రోడ్డు విస్తరణలో భాగంగా ఆర్‌టిసి బస్టాండ్ నిరుపయోగంగా ఉంది. ఇక్కడ బస్‌షెల్టర్ లేదు. దీంతో ఎండ, వానా కాలంలో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా మరుగుదొడ్ల సౌకర్యం లేక మహిళా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు ఎండలోనే నిరీక్షించాల్సి వస్తోంది. మండల కేంద్రంలో దాదాపు 15 నుంచి 20కిపైగా విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, షాపింగ్ మాల్స్ ఉన్నాయి. రణస్థలం నుంచి రాష్ట్రం నలుమూలలకు వెళ్లేందుకు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, వలసకూలీలు తదితరులు రణస్థలం సెంటర్‌లోనే బస్సు ఎక్కాలి. ఆర్‌టిసి బస్సులకోసం రోడ్డుపైనే నిలబడాలి. బస్‌షెల్టర్ లేకపోవడంతో ఇక్కడున్న షాపులు, లాడ్జీలు, కిరాణాషాపుల ఎదుట ప్రయాణికులు నిల్చుని ఉంటున్నారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణలో భాగంగా ఇరువైపుగా ఉన్న షాపులు, ఇళ్లను నేలమట్టం చేయడంతో ప్రయాణికులకు ఆ కొద్ది నీడ కూడా లేకుండా పోయింది. మండలంలో సుమారు చిన్నపెద్ద కలిపి 90 వరకు గ్రామాలున్నాయి. ఈ సెంటర్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు బస్సుల కోసం వేచి ఉంటారు. బస్సుల కోసం గంటల కొద్దీ ఎండలో రోడ్డుపక్కనే వేచి ఉండాల్సి వస్తోంది. కొద్దిపాటి వర్షం కురిసినా తలదాచుకునేందుకు చోటులేక లగేజీలు, పిల్లాపాపలతో తడవాల్సి వస్తోంది. బస్‌షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కానరాని మరుగుదొడ్లు

నిత్యం వందలాది మంది ప్రయాణికులతో వివిధ పనుల మీద ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారితో రణస్థలం సెంటర్ కిటకిటలాడుతుంది. ప్రధానంగా ఈ ప్రాం తంలో మరుగుదొడ్డి సౌకర్యం లేక బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికులు, బస్సు దిగిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళా ప్రయాణికుల బాధలు వర్ణణాతీతం. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు పబ్లిక్ టాయిలెట్లను నిర్మించాలని, ఆర్‌టిసి అధికారులు బస్సు షెల్టర్ నిర్మించాలని కోరుతున్నారు.



బస్ షెల్టర్ లేక రోడ్డుపై నిల్చొన్న ప్రయాణికులు

నిరుపయోగంగా రాజీవ్ టూరిజం పార్కు


ఇచ్ఛాపురంపట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రాజీవ్ టూరిజం పార్కు గాలికి విడిపెట్టారు. మాజీ సిఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర ఇచ్ఛాపురంలో ముగిసింది. దానికి గుర్తుగా టూరిజం పార్కును ఏర్పాటు చేశారు. యుద్ధప్రాతిపదికన నిర్మించి సిఎం హోదాలో వైఎస్ఆర్ ప్రారంభించారు. ఈ పార్కుకు ప్రజాప్రస్థాన విజయా వాటిక పేరుతో రాజీవ్ టూరిజం పార్కు నామకరణ చేశారు. ఈ పార్కు అభివృద్ధిలో ఆ తరువాత వచ్చిన పాలకులు పూర్తిగా గాలికొదిలేశారు. పార్కు నిర్వహణకు అధికంగా భారం ఉంటుందని మున్సిపల్ అధికారులు బాధ్యత తీసుకోలేదు. టూరిజం శాఖ ఆధ్వీనంలో ఉన్నా... వారూ పట్టించుకోలేదు. దీంతో యువకులు పగటి పూట క్రీడలు ఆడితే, రాత్రి పూట అసాంఘిక కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. వైసిపి ప్రభుత్వంలో మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్ఛాపురం నియోజకవర్గానికి గ్రీన్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి కట్టబెట్టారు. ఈ కార్పొరేషన్ చైర్మన్‌గా నర్తు రామారావు బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత పార్కు అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించారు. సంబంధిత అధికారులు ఇచ్ఛాపురం వచ్చి పార్కు



నిరుపయోగంగా ఉన్న ప్రజా ప్రస్థానం పార్కు

అభివృద్ధికి ప్రణాళిక రూపొందించారు. కచ్చితంగా పార్కు అభివృద్ధి చెందుతుందని పట్టణవాసులు భావించారు. కానీ, నిధులు విడుదల కాపోవడంతో ఆ కార్పొరేషన్ నుంచి రామారావు తొలగించారు. మళ్లీ ఈ టూరిజం పార్కు అబివృద్ధికి అడ్డంకులు మొదలయ్యాయి. దీంతో మళ్లీ పార్కు అభివృద్ధికి ఎవరూ పట్టించుకునే పాపానపోలేదు. విగ్రహాలకు నివాళ్లర్పించడాని రావడం తప్ప తరువాత కనిపించిన దాఖలాలు లేవు. పట్టణంలో ప్రాధానత్య సంచరించుకున్న ప్రాంతంలో నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైంది. కనీసం సుధీర్ఘ లీజుకు ఇచ్చిన పార్కు అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని స్థానికులు అంటున్నారు. అటు లీజుకు ఇవ్వక, ఇటు అభివృద్ధి నోచుకోకపోవడంతో టూరిజం పార్కు నిరుపయోగంగా మారింది.

పచ్చదనం...ఆ పాఠశాల సొంతం



పచ్చదనంతో పాఠశాల ప్రాంగణం

పచ్చదనం పెంపు, పరిశుభ్రత అనేది పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు తెలుసుకోవాలి. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్న ఆలోచన పాఠశాలలోనే ఉపాధ్యాయుల నుంచి విద్యార్థులు నేర్చుకోవాలి. అప్పుడే పచ్చదనం వెల్లివిరిసి ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు విద్యాబుద్ధులను నేర్చుకుంటారు. ఈ విషయాన్ని గమనించిన ఆ పాఠశాల ఉపాధ్యాయులు పచ్చదనం పెంపుపై దృష్టిని సారించి ఆ పాఠశాలను ఎంతో సుందర వనంగా తీర్చిదిద్దారు.



తరగతి గదులకు వెళ్లే రహదారికి ఇరువైపులా పెరిగిన మొక్కలు

- **పుట్టినరోజు మొక్కను నాటడం ఆనవాయితీ**
- **ఆదర్శంగా నిలుస్తున్న తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల**

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం వివిధ రకాల చెట్లుతో నిండుగా పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కలిగిస్తూ ఆదర్శంగా నిలుస్తుంది. పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒక ఉద్యమంలా నిర్వహిస్తున్నారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 200 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతను ఇస్తూ వివిధ రకాలైన బాదం, కదంబా, కాగు, కోనాకార్పస్, టేబుల్‌పామ్, దేవకాంచన, ఉసిరి, మారేడు, ఏనుగుబాదం, సైకస్, హీవియా, పారిజాతం, జమ్మి, అశోక వంటి మొక్కలతో పాటు అలంకారంగా కనిపించేలా పలు రకాల పూలమొక్కలను పెంచుతూ పాఠశాల ప్రాంగణాన్ని నందనవనంలా తయారు చేశారు.

మొక్కలు నాటడం ఆనవాయితీ

ప్రతిఒక్కరూ తమ పుట్టినరోజు వచ్చింంటే స్నేహితులతో కలిసి సరదాగా గడుపుతూ వేడుక చేసుకుంటారు. అయితే దీనికి అతీతంగా ఈ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పుట్టిన రోజున మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యతను చేపట్టడం పలువురికి ఆదర్శంగా నిలుస్తుంది. ఈ విధంగా ఉపాధ్యాయులు పర్యావరణ పరిరక్షణపై తమ బాధ్యతను చిన్ననాటి నుంచే విద్యార్థులకు అలవర్చుతుండడం గొప్ప విషయం. ఈ విధంగా సుమారు ఐదేళ్లగా పాఠశాల ప్రాంగణంలో వందలాది వివిధ రకాలైన మొక్కలను నాటి వాటి సంరక్షణను విద్యార్థులు, ఉపాధ్యాయులు చేపడుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా..



పాఠశాలలో మొక్కలను నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణ ఒక బాధ్యతగా విద్యార్థుల్లో అలవర్చుతున్నాం. అంతే కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో నేర్చుకున్న పాఠాలు విద్యార్థుల్లో శాశ్వత ముద్రను వేస్తాయి. ప్రతి విద్యార్థి పుట్టినరోజు మొక్కలను నాటడం ఒక ఆనవాయితీగా చేపడుతున్నాం. ఈ విధంగా పాఠశాలను నందన వనంలా తయారు చేసి ఆదర్శ వంతంగా తీర్చిదిద్దాం.

- బల్ల కంటయ్య, హెచ్‌ఎం, జెడ్‌పిహెచ్‌ఎస్, తాడివలస

ఒక ఉద్యమంలా చేపడుతున్నాం



పాఠశాలలో మొక్కలు నాటడం గత ఐదేళ్లుగా ఒక ఉద్యమంలా చేపడుతున్నారు. విద్యార్థులకు విద్యా బుద్ధులతో పాటు పచ్చదనం పెంపు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుతున్నాం. పాఠశాలలో హెచ్‌ఎంతో పాటు, సైన్స్ ఉపాధ్యాయులు రావాడ పాపారావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులతో కలిసి సుందరవనంగా రూపొందించాం. విద్యార్థుల ందరూ పర్యావరణ ప్రేమికులుగా మారి పాఠశాల వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు.

- పూజారి హరిప్రసన్న, నేషనల్ గ్రీన్‌కోర్ క్లస్టర్ సమన్వయకర్త



విద్యార్థినికి మొక్కలను అందజేస్తున్న హెచ్‌ఎం కంటయ్య



పుట్టినరోజున మొక్కలు నాటుతున్న విద్యార్థులు (ఫైల్)

జోరుగా జూదం!

డబ్బులు పోగొట్టుకొని లబోదిబోమంటున్న యువత



ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా వాడవాడలా పలుచోట్ల జూదం జోరుగా సాగుతుంది. ఎటువంటి కష్టం లేకుండా సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో కొంతమంది వ్యక్తులు చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ జూద కేంద్రాలను నడుపుతున్నారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. జూద కేంద్రాలను నడుపుతూ పట్టుబడ్డ వ్యక్తులు కొంతమందయితే మరి కొంతమంది పోలీసులకు నజరానాలు చెల్లిస్తూ చట్టానికి దొరక్కుండా పెద్దలుగా చలామణి అవుతూ అతితక్కువ కాలంలో సొమ్ములు పోగేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది యువకులు జూదాన్ని వృత్తిగా స్వీకరించి జూద గృహాలను ఏర్పాటు చేస్తూ జూదానికి బానిసలైన ఉద్యోగులు యువకులను గుర్తించి వారి జేబులకు చిల్లులు పెడుతూ వారిని నిలువునా ముంచేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ఉద్యోగరీత్యా ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన యువత పట్టణం, పల్లెలకు భారీగా చేరుకుంటున్నారు. ఇదే ఆదునుగా జూద క్రీడలపై ఆసక్తి కలిగిన వారిని గుర్తించి నిర్వాహకులు కేంద్రాలకు తరలించి వారి జేబులను గుల్ల చేస్తున్నారు. జూదరులను ఎవరైనా నిర్వాహకులకు అప్పగిస్తే అప్పగించిన వ్యక్తికి కొంత మొత్తం నగదు అందిస్తున్నట్లు తెలిసింది. పట్టణంలోని మెట్టక్కివలసకు చెందిన ప్రతిపక్ష పార్టీకి చెందిన ఒక యువ నాయకుడు జూద కేంద్రాన్ని ఏర్పాటు చేసి సకల సౌకర్యాలు కల్పించి జూదం ఆడిస్తూ లక్షల రూపాయల్లో దోచుకుంటున్నారని అక్కడి ప్రజలు పలువురు ఆరోపిస్తున్నారు. జూద కేంద్రాల క్రీడలు నిర్వహించే వారిని ప్రశ్నిస్తే దాడులకు తెగ పడతారని పలువురు చెబుతున్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన యువ నాయకుడు తమ్ముడు గతంలో ఒడిశా నుంచి ఖైనీలు గుట్కాలు అక్రమ మార్గంలో పట్టణానికి తెప్పించి అప్పటి పోలీస్ అధికారులకు తాయిలాలు ఇచ్చి అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తారని పలువురు చర్చించుకుంటున్నారు. అలాగే పురపాలక సంఘంలోని 17వ వార్డులోని పూజారిపేటలోని కొంతమంది యువకులు జూద గృహాలను ఏర్పాటు చేసి యువతను పెడదోవ పట్టిస్తున్నారని పలువురు తల్లిదండ్రులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి జూద క్రీడల్లో కోట్ల రూపాయలను పోగొట్టుకొని అప్పులపాలై ఐపి పెట్టడానికి కూడా సిద్ధపడ్డాడు. అలాగే మర్చెంట్ నేవీలో పనిచేసే మరో యువకుడు బెట్టింగలలో దివాలా తీయడంతో ఆయన తల్లిదండ్రులు వారికి ఉన్న కొద్దిపాటి స్థలాన్ని విక్రయించి అప్పులను తీర్చారు. అక్కడి నుంచి ఆ యువకుడిని ఆమదాలవలస పట్టణానికి రావద్దని ఆయన దగ్గర మాట తీసుకున్నట్టు సమాచారం. 15వ వార్డులోని గణేష్ నగర్‌లో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన ఇంటిని జూద కేంద్రంగా మార్చి ఉద్యోగులతో సెలవు దినాలు వారాంతపు సెలవులలో జూదం ఆడిస్తూ ఒక ఆటకు కొంత మొత్తంలో నగదును కూడా తీసుకుంటాడని పలువురు జూదరులు చెబుతున్నారు. అలాగే వెంకయ్యపేటకు చెందిన ఓ వ్యక్తి బొడ్డేపల్లి పేట వెనుక వైపున ఉన్న కొండల వద్ద పార్వతీశం పేట హద్దులలో ఉన్న పాడుబడ్డ ఇందిరమ్మ కాలనీ ఇళ్లలో జూదం ఆడిస్తూ లక్షల రూపాయలు యువత నుంచి దోచుకుంటున్నాడని పలువురు చెబుతుండడం విశేషం. ద్విచక్ర వాహనాలతో జూదరులను కేంద్రాల వద్దకు తీసుకువెళ్లి మద్యం, భోజనం వంటి సకల సౌకర్యాలు ఏర్పాటు చేసి జూద క్రీడను మూడు పువ్వులు ఆరు కాయలుగా విరజిల్లేటట్లు నిర్వాహకులు కొనసాగిస్తున్నారు. పట్టణంలోని లాడ్జిలలో వర్తకులు, రైల్వే ఉద్యోగులు ఎప్పటికప్పుడు జూదం ఆడుతూ ఉంటారని కనీసం అటువైపు పోలీసుల కన్నెత్తి కూడా చూడరన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అక్కులపేట సంత, కొత్తవలస మామిడి తోటలు, వయోడక్ట్ దాండ్రాసి మెట్ట వంటి ప్రాంతాలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలలో జూదరులను తీసుకువచ్చి పెద్ద ఎత్తున జూదం ఆడిస్తుంటారని చుట్టుపక్కల ప్రజలు పలువురు చెబుతున్నారు. జూదం ఆటకు తీసుకువచ్చిన డబ్బులుపోయి జేబులు ఖాళీ అయితే వెంటనే కేంద్రాల నిర్వహకులు బంగారం, ద్విచక్ర వాహనాలను తాకట్టు పెట్టుకుని వెంటనే డబ్బులను ఆటగాళ్లకు సమకూరుస్తారని, ఒకవేళ తాకట్టు పెట్టడానికి ఏమీ లేకపోతే ప్రామిసరీ నోటుపై నూటికి పది రూపాయల చొప్పున అక్కడికక్కడే డబ్బులను ఇచ్చి ఆటను ఆడిస్తారని పలువురు జూదరులు చెబుతుండడం విశేషం.

ముడుపుల మత్తులో...

జూద స్థావరాల వద్ద మూడు అంచెల భద్రతను పటిష్టంగా ఏర్పాటు చేస్తారని ముందుగానే స్థానిక అధికారులకు ముడుపులు ముట్ట జెప్పి ఎటువంటి అడ్డంకులు లేకుండా తొలగించుకుంటారని పలువురు చెబుతున్నారు. జూద క్రీడలకుబలై చాలా కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నప్పటికీ అటు నిర్వాహకులు ఇటు అధికారుల్లో ఎటువంటి చలనం లేకపోవడం చాలా బాధాకరమని పలువురు విమర్శిస్తున్నారు.

జూదంలో డబ్బులు పోగొట్టుకొని లబోదిబోమని యువత గగ్గోలు పెడుతున్నారు. అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో అత్యాశకు పోయి యువత జూదంలో సర్వం కోల్పోయి ఇబ్బందుల పాలవుతున్నారు. జూద నిర్వాహకులు దగ్గర తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక అసలు చెల్లించలేక శతమతమవుతూ అప్పులు తీర్చమని ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి జూదాన్ని అరికట్టి యువతకు కౌన్సిలింగ్ ఇచ్చి మంచి మార్గంవైపు మళ్లేటట్లు చర్యలు తీసుకోవాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల వాడకం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్లాస్టిక్ కవర్ల నిషేధం అమలు కావడం లేదు. అన్నిచోట్ల వాడకం కొనసాగుతోంది. పంచాయతీ అధికారులు, సిబ్బంది గత కొన్ని సంవత్సరాల నుంచి కనీసం నామమాత్రంగా కుడా దాడులు చేయకపోవడం, చూసి చూడనట్లు వ్యవహరించడంతో వినియోగం చాలా ఎక్కువైంది. ప్రతిరోజూ 25 శాతం ప్లాస్టిక్ కవర్లు వస్తుండటం ఆందోళన కలిగించే విషయం. అన్ని గ్రామాల్లో రోడ్లమీద, వీధుల్లో ఎటుచూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. మురుగు కాల్వలు, చెరువులు, కుంటలు, చెత్తకుప్పలో పాలిథిన్ కవర్లే దర్శనమిస్తున్నాయి. పర్యావరణానికి ముప్పు వస్తున్న ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని క్రయ విక్రయదారులతో పాటు అధికారులు, సిబ్బంది ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 2016లో ప్లాస్టిక్ నిషేధం అమలులోకి తెచ్చారు. ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లులో ప్యాక్ చేయడం, సరఫరా చేయడం నిషేధమంటూ కచ్చితమైన నిబంధన తీసుకొచ్చారు. అయినా అది ఎక్కడా అమలు కావడం లేదు. రణస్థలం మండల కేంద్రంలోని ప్లాస్టిక్ కవర్ల నిషేధం కోసం తీర్మానాలు చేసినా ఆచరణలోకి రాలేదు. మండల పరిధిలో ఎక్కడపడితే అక్కడ పాలిథిన్ కవర్లను వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లలో 90 శాతానికిపైగా 50 మైక్రాన్ల కంటే తక్కువ ఉండే కవర్లను ఉపయోగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. టన్నుల ప్లాస్టిక్ కవర్ల వినియోగం జరుగుతున్నా ప్రత్యేకంగా దృష్టి సారించిన సందర్భాలు లేవు. అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉంది. నిషేధిత కవర్లను బహిరంగంగానే విక్రయిస్తున్నా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్న దాఖలాలు లేవు. మరోవైపు విజయవాడ, హైదరాబాద్, చెన్నై, వంటి ప్రాంతాల నుంచి ప్లాస్టిక్ కవర్లు టన్నుల కొద్దీ దిగుమతి అవుతున్నాయి. ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన, ప్రత్యామ్నాయ పద్ధతులు ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలకు మరో మార్గం లేకపోవడం కూడా వినియోగం పెరగడానికి ఓ కారణమవుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు దీనిపై కఠినంగా వ్యవహరించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.



బూర్జ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

గోకులాలతో రైతులకు మేలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాడి రైతుల సంక్షేమానికి చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం శ్రీకూర్మం పంచాయతీ అయ్యవారిపేటలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మినీగోకులం షెడ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పశుపోషణ, కోళ్ల, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పశువుల నివాసానికి కొద్దిపాటి స్థలం ఉంటే మినీగోకులం పేరిట షెడ్లు నిర్మించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. 90 శాతం సబ్సిటీతో ప్రభుత్వం అందించే ఈ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్థకశాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బూర్జ : పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని డొంకలపర్తలో గోకులాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు తాగునీటి సౌకర్యం లేదని, అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆరు నెలల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేస్తామని, గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మిస్తామని హామీనిచ్చారు. పాలకొండ సిఎస్‌పి రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డులో విద్యుత్ స్తంభాలకు లైట్లు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. అనంతరం సౌత్ జోన్ స్విమ్మింగ్ లో జాతీయ క్రీడల్లో సాధించిన బలగ స్వామినాయుడును సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు వావిలపల్లి సీతారాం బాబునాయుడు, తూర్పు కాపు ఉపాధ్యక్షులు కె.జయరామ్, లంక జగన్నాథం, ఎఎంసి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కార్యదర్శుల సంఘం అధ్యక్షులు మురళీకృష్ణ పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్



శిథిలావస్థలో ఆర్అండ్‌బి బంగ్లా

రణస్థలం: జిల్లా ముఖ ద్వారం రణస్థలం మండల కేంద్రంలో 16 నెంబర్ జాతీయ రహదారికి అనుకుని ఉన్న బ్రిటీష్ హయాం లో నిర్మించిన ఆర్అండ్‌బి బంగ్లా శిథిలావస్థకు చేరింది. గతంలో ఇక్కడ జిల్లాను సందర్శించేందుకు వచ్చే పర్యాటకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ బంగ్లాలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకొనేవారు. ఈ రహదారి బంగ్లాను వదిలేయడంతో శిథిలావస్థకు చేరుకుంది. గతంలో ఈ బంగ్లాలో ఒక అటెండర్, వాచ్‌మేన్ పనిచేసే సిబ్బంది ఉండేవారు వారు రిటైర్మెంట్ అయిన తరువాత ఆ సిబ్బందిని నియమించక పోవడంతో బంగ్లా ఆలనాపాలన చూసేవారు లేక శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఈ శిథిలభవనంలో చీకటి కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే పూర్తిగా విడిచి పెట్టడంతో విష సర్పాలకు నిలయంగా మారింది. అధికారులు స్పందించి ఈ భవనాన్ని పూర్తిగా తొలగించి నూతనంగా నిర్మించి వినియోగంలోకి తీసుకువస్తే ప్రయోజనంగా ఉంటుందని పలువురు. కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న ఆర్అండ్‌బి బంగ్లా

భోగి మంటల్లో ఎయిర్‌పోర్టు ప్రతిపాదన ప్రతులు



మందస : భోగి మంటల్లో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- మందస

పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్టు నిర్మించాలనే ప్రభుత్వ ప్రతిపాదన విరమించాలని సిపిఎం నాయకులు ఎన్.గణపతి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు ఎం.రామారావు, ప్రజా సంఘాల నాయకులు టి.అజయ్ కుమార్, జి.బాలకృష్ణ, పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కొమర వాసు, డి. రామారావు, ఎం.సంతోష్, సర్పంచ్ పి.ధర్మారావు డిమాండ్ చేశారు. మండలంలోని రాంపురం, టి.గంగువాడ, ఎం.గంగువాడ, బిడిమి తదితర గ్రామాలలో సంక్రాంతి ప్రారంభ సూచిక భోగి మంటల్లో కార్గో ఎయిర్ పోర్టు ప్రతిపాదన ప్రతులను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ల కడుపు నింపేందుకు రైతులను బలిచేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఒకరిద్దరి ప్రయోజనాలు కోసం వేలాది మంది ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతారా? అని ప్రశ్నించారు. ఉద్దానం అంటే ఉద్యాన వనమేకాదు, ఉద్యమాల వనమని అన్నారు. కార్గో ఎయిర్ పోర్టును, కార్పొరేట్లను, వారికి కొమ్ము కాస్తున్న ప్రజా ప్రతినిధులను తరిమేదాక ఐక్యంగా ఉద్యమిద్దామని ప్రతినబూనారు. కార్యక్రమంలో వామ పక్షాల నాయకులు టి.రాజు, ఎస్.జగన్, గ్రామ ప్రతినిధులు టి.రాజారావు, టి.తుంబనాదం, ఎం.జనార్ధన, జె.ఢిల్లేశ్వరరావు, జె.సాంబమూర్తి, గురువులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: వామపక్షాలు నాయకులు, ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యాన భోగి మంటల్లో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, సిహెచ్.రవి, లిబరేషన్ నాయకులు సన్యాసిరావు, పోరాట సమితి కార్యదర్శి జోగి అప్పారావు, చెడు పెళ్లి వల్లభరావు, లండ ఈశ్వరరావు, గుంట రమణయ్య శ్రీదేవి, సుశీల, సావిత్రి, వరలక్ష్మి, లాలాక్షీ, కుమారి పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు : భోగి మంటల్లో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

పంచాయతీల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గౌతు శిరీష



వజ్రపుకొత్తూరు : నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు: స్థానిక ఎన్నికల నాటికి ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని పళ్లిపూరు పంచాయతీ మురిపింటివాని పేటలో పంచాయతీ అభివృద్ధి కోసం రూ.లక్షను టిడిపి నాయకులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. రూ.లక్ష నగదుతో పంచాయతీని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి, మాజీ ఎంపిపి వసంత స్వామి, అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు సురాడ మోహనరావు, వంక రామారావు, లండ వాసు, కర్ని రమణ, దున్న షణ్ముఖరావు, గోవింద పాపారావు, కోనారి కిరణ్, రామకృష్ణ, ఎంపిటిసి మాజీ సభ్యులు మురిపింటి పాపారావు పాల్గొన్నారు.

పలాస : సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేశామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీలో ఏ వార్డులో అధికంగా టిడిపికి మెజారిటీ సాధించిందో వారికి రూ.లక్ష నగదు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, కుత్తుం లక్ష్మణకుమార్, దువ్వాడ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

స్నేహితుల ఆర్థికసాయం

ప్రజాశక్తి- నందిగాం

నందిగాం ఉన్నత పాఠశాలలో 1996-97లో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న శాసనపూరి చిన్నబాబు ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు మృతుడి స్వగ్రామం లఖిదాసుపురానికి వెళ్లి రూ.25 వేలు ఆర్థికసాయం సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సహచర విద్యార్థులు మాదిన జయంతిరావు, సనపల గోపాలరావు, జి.షణ్ముఖరావు, బొంగి సుశీల, కొంకి సుధారాణి, బల్ల శ్రీనివాసరావు, బలిది బాలకృష్ణ, సీమ భాస్కరరావు, వట్టి లక్ష్మణరావు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

కేలండర్ ఆవిష్కరణ

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మండలం ఈదుపురం సత్యసాయి మోడల్ స్కూల్ ప్రాంగణంలో మహతి సాంస్కృతి కళా సంస్థ కేలండర్‌ను సోమవారం ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ గౌరవాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి సలహాదారుల ఆధ్వర్యాన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నర్తు నరేంద్ర యాదవ్, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, కాయ భీమసేన్, కళా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



సామగ్రిని కొనుగోలు చేస్తున్న కొనుగోలుదారులు

పట్టణంలో సంక్రాంతి శోభ

ట్రాఫిక్ మళ్లించిన పోలీసులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

తెలుగు ప్రజల ప్రధాన పండగల్లో ఒకటైన సంక్రాంతి పండగ సందర్భంగా సోమవారం పట్టణంలో కొనుగోలుదారులతో కిటకిటలాడింది. ఏటాలాగానే పట్టణంలోని ప్రధాన రహదారిపైనే అన్ని రకాల షాపులను వర్తకులు ఏర్పాటు చేశారు. దీనితో శ్రీకాకుళం నుంచి హిరమండలం, బత్తిలి, పాతపట్నం, ఒడిశా వెళ్లాల్సిన వాహనాలను వన్ వే మీదుగా పోలీసులు మళ్లించారు. పూజారిపేట, మోణింగి వారి వీధి మీదుగా దారి మళ్లించారు. సంక్రాంతి పండగ కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైల్వే ప్రయాణికులు తమ స్వగ్రామాలకు వెళ్లడానికి, వచ్చేవారికి వాహనాలను దారి మళ్లించడంతో కొంతమేర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆమదాలవలస, గార, సరుబుజ్జిలి, బూర్జ మండలాలతో పాటు పట్టణానికి చెందిన ప్రజలు భోగి పండగను ఉదయాన్నే నిర్వహించి సామగ్రి కోసం ఆమదాలవలస పట్టణానికి చేరుకున్నారు. దీంతో రోడ్లు, షాపులు జనసంద్రంగా మారి కిటకిటలాడాయి. సంక్రాంతి పండగకు అవసరమైన దుస్తులు, వంటలకు ఉపయోగించే మట్టి కుండలు, వివిధ రకాల పూజా సామగ్రి కొనుగోలు చేశారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

డిప్యూటీ డిఇఒ విలియం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని టెక్కలి డిప్యూటీ డిఇఒ పి.విలియం అన్నారు. మండలంలోని బోరుభద్ర వివేకానంద పాఠశాలలో 25వ వార్షికోత్సవం, పదో తరగతి వీడ్కోలు సభ సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. తీర ప్రాంతంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ 25 ఏళ్ల ప్రయివేటు పాఠశాల నడిపినందుకు కరస్పాండెంట్ లోల్ల సూర్యనారాయణ అభినందించారు. తీర ప్రాంతంలో కార్పొరేట్‌కు ధీటుగా ప్రయివేటు పాఠశాలను అభివృద్ధి చేశారని అన్నారు. అనంతరం జోనల్ స్థాయిలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. జోనల్ స్థాయి టాలెంట్ టెస్టు ఫలితాల్లో ఏడో తరగతి విభాగంలో ప్రథమ బహుమతి కాశీపేట ప్రాథమిక ఉన్నత పాఠశాల నుంచి కె.మీనాక్షి, ద్వితీయ బహుమతి టి.నీరజ తృతీయ బహుమతి, ఎ.స్నేహ విశ్వశాంతి స్కూల్ పోలాకి, ఆరో తరగతి విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోరుభద్ర నుంచి ప్రథమ బహుమతి బి. తుహినా, ద్వితీయ బహుమతి ఎం.దివ్యసాయి విశ్వశాంతి స్కూల్ పోలాకి, తృతీయ బహుమతి డి.సంజయ్ నాయుడు మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల అంట్లు వరం, పదో తరగతి విభాగంలో ప్రథమ బహుమతి పి.నందిని, ద్వితీయ బహుమతి వై.కీర్తిక గోదలాం ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల, చొక్కరవానిపేట ప్రాథమిక పాఠశాల నుంచి తృతీయ బహుమతి ఎస్.వెంకట తనుశ్రీ, నాలుగో తరగతి విభాగంలో సంతబొమ్మాళి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి వై.యతీశ్, చొక్కరవానిపేట ప్రాథమిక పాఠశాల నుంచి ద్వితీయ బహుమతి జె.యువరాజ్, గొలుగువానిపేట ప్రాథమిక పాఠశాల నుంచి తృతీయ బహుమతి జి.అలేఖ్య విజయం సాధించారు. సీనియర్ విభాగంలో జోనల్ స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులను పోలాకి విశ్వశాంతి స్కూల్ విద్యార్థులు గెలుపొందారు. తృతీయ బహుమతి కోటబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. కార్యక్రమంలో ఎంఇఒలు చిన్నవాడు, అర్జునుడు, ఎంపిటిసి మాజీ సభ్యులు వల్లభ వసంతరావు, బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ, వడ్డివాడ మాజీ సర్పంచ్ బాడాన వసంతరావు, వెటర్నరీ అసిస్టెంట్ ఎం.వెంకటరావు, సూరాడ జోగారావు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న విలియం



సరుకులు అందజేస్తున్న పురుషోత్తంనాయుడు

సేవలతోనే సంతృప్తి

ఎపి ఎన్‌జిఒ పూర్వ ప్రధాన కార్యదర్శి పురుషోత్తంనాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సామాజిక సేవలు మానసిక సంతృప్తినిస్తాయని ఎపి ఎన్‌జిఒ పూర్వ ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు అన్నారు. నగరంలోని గోవింద నగర్ కాలనీలో సోమవారం చాపురం-2 సచివాలయం పరిధిలోని పారిశుధ్య కార్మికులకు మునసబుపేట గాయత్రి డిగ్రీ కాలేజ్ 96-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమకూర్చిన రూ.30 వేల విలువ చేసే నిత్యావసర సరుకుల కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకొని సంక్రాంతి పండగ శుభ సమయంలో పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొమ్మన విజయ్‌కుమార్, బిర్లంగి రామ్మోహన్, మూల గోవిందరావు, సతివాడ శంకర్, కొంక్యాన సత్యనారాయణ, సూర శ్రీధర్, బలగ శంకర్, దుంపల రమణ, మొజ్జాడ సూర్యకిరణ్, సకలభక్తుల హరిప్రసాద్, పిండి మధు, శేషగిరి, పడాల శ్రీనివాస్, బడగల జగదీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ ఈశ్వరరావు

నిరంతర శ్రామికులు పోలీసులు

రెండో పట్టణ సిఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్ : ప్రజలకు నిరంతరాయంగా సేవలందిస్తూ నిస్వార్థంగా పనిచేస్తున్న శ్రామికులు పోలీసులని రెండో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు అన్నారు. నగరంలోని వివన్ హాల్‌లో నేషనల్ యూత్ డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్ సద్గుణ ఆధ్వర్యాన అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ సంస్థ ప్రోత్సాహంతో రెండు నుంచి డిగ్రీ విద్యార్థులు వివిధ తరగతుల్లో చదువును కొనసాగిస్తున్నారన్నారు. వారికి సంస్థ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి హారిక, గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు సద్గుణ, సభ్యులు స్వరూప్, సంతోషిణి, సౌజన్యపట్నాయక్, ఉర్లాం శివతేజ పాల్గొన్నారు.

నేటి నుంచి దేవి జాతర

ఆమదాలవలస : పురపాలక సంఘంలోని ఆరో వార్డు పరిధిలో ఉన్న నందగిరిపేటలో అశ్వద్ధ క్షేత్రంలో ఉన్న లలితా రాజరాజేశ్వరి ఆలయంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అప్పన్న భవాని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతరలో యాత్రికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తీరంలో సందడి

కవిటి: సంక్రాంతి శోభ తీరంలో కనిపించింది. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ సముద్ర తీరంలో సేద తీరారు. ఆడారు.. పాడారు. కేరింతలు కొట్టారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. ఈ సంక్రాంతి సంతోషాలను మదినిండా నింపుకున్నారు.



తీరంలో సందడి చేస్తున్న యువకులు

కట్టెల అమ్మకమే జీవనోపాధి

ఇబ్బందిగా మారిన కుటుంబ పోషణ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో సుమారు 70 శాతం గిరిజన గ్రామాల్లో గిరిజనులు కొండ ప్రాంతాల్లో నివాసం ఏర్పరచుకొని వందల సంవత్సరాల కాలం నుంచి జీవనం కొనసాగిస్తున్నారు. కానీ, ఇప్పటికీ నాగరికతకు దూరంగా నివసిస్తున్నారు. నిరక్షరాస్యత, ఆర్థిక సామాజిక సమస్యలతో విలవిలలాడుతూనే ఉన్నారు. గిరిజనులకు ప్రధాన వృత్తి కట్టెల అమ్మకం, పోడు వ్యవసాయం. మండలంలో సుమారుగా అటవీ ప్రాంతంలో నివాసం ఏర్పరచుకున్న గిరిజనులందరూ ఇదే వృత్తిలో కొనసాగుతున్నారు. మండలంలోని కేరాసింగి, వెంకటాపురం, బంజీరుపేట, పడ్డ, దీనబంధుపురం తదితర గ్రామాల నుంచి కట్టెలను మండల కేంద్రానికి తీసుకువచ్చి విక్రయిస్తూ ఉంటారు. ఈ కట్టెల అమ్మకంతో వచ్చిన డబ్బులతో కుటుంబ పోషణ చేసుకుంటున్నారు. వీటితో వచ్చిన నగదుతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని ఆంపురం, సవరజాడు పల్లి, పరుశురాంపురం, భరణికోట, గ్రామాలకు చెందిన గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబం మొత్తం కష్టపడిన రోజుకు రూ.300 రావడం కష్టమని వారంటున్నారు.


బంజీరుపేటలో పొయ్యిపై వంట చేస్తున్న ఆదిలక్ష్మి

కట్టెలకు తగ్గిన గిరాకీ

మైదాన ప్రాంతంలోని పూరి గుడిసెల్లో ఉన్నవారు కూడా గ్యాస్ పొయ్యిలను వినియోగిస్తున్నారు. దీంతో కట్టెలను కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఉన్నంతలో చిన్న చిన్న హోటళ్లకు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు కట్టెలను విక్రయిస్తున్నట్లు గిరిజనులు చెబుతున్నారు. ఆయా గిరిజన గ్రామాల నుంచి ఎవరైతే హోటళ్లలో యజమానులు ఉంటారో వారే కొనుగోలు చేస్తారు. నేరుగా వారి ఇళ్ల వద్దకే వెళ్లి అమ్మాల్సి ఉంటుంది. కట్టెల మోపు కేవలం రూ.150 మాత్రమే ధర పలుకుతుంది. ఒక కుటుంబంలో ఇద్దరు వ్యక్తులు ఒక రోజంతా కష్టపడితే రెండు మోపులు మాత్రమే కట్టెలు కొట్టి అమ్మకం చేపడుతున్నామని అంటున్నారు.

ఇప్పటికీ కట్టెల పొయ్యిలపైనే వంట

గిరిజన మహిళలు అధికంగా కట్టెల పొయ్యిపైనే వంట చేయడానికి మొగ్గు చూపుతున్నారు. ఎందుకని వారిని ప్రశ్నిస్తే వంట గ్యాస్ అందుబాటులో ఉన్నా దానిని వాడడం వారికి ఇబ్బందికరంగా ఉంటుందని చెబుతున్నారు. కట్టెల పొయ్యిలపైనే వంటలు చేస్తూ ఆచారంగా వస్తున్నామని, ఆ తిండి తినడానికి రుచికరంగా ఉంటుందని వారి అభిప్రాయపడుతున్నారు. అదే ఆరోగ్యకరమని అమాయకంగా సమాధానం చెబుతున్నారు. గిరిజనుల లబ్ధికి ప్రభుత్వాలు ఎన్నో రకాల సంస్థలు


నందవలో కట్టెలు తీసుకెళ్తున్న సాయమ్మ

ఉత్పత్తిలో నెలకొల్పుతున్నామని గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తూ గిరిజనులకు ఎన్నో రకాలైన అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెబుతున్నాయి. అయినా గిరిజనుల జీవనోపాధి మారేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని గిరిజన సంఘాల నేతలు వాపోతున్నారు. గిరిజనుల ఆర్థిక పురోగతి కోసం ఆయా గ్రామాల్లోనే కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసి జీవనోపాధి కలిగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుకుంటున్నారు.

కుటుంబ పోషణ కష్టంగా ఉంది



రోజూ చిన్న పిల్లలను ఇంట్లో విడిచిపెట్టి పక్కనే ఉన్న అడవిలో కట్టెలు కొట్టి తీసుకొచ్చి వాటిని మోపులుగా కట్టి మెళియాపుట్టిలో విక్రయిస్తాం. రోజుకు రూ.300 గిట్టుబాటు రాదు. దాని ద్వారా వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషించాలంటే ఇబ్బందికరంగా ఉంది. మా కష్టాన్ని తీర్చే వారెవరో కానరావడం లేదు.

- డి.దండాసి, ఆంపురం

కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



గిరిజన గ్రామాల్లోనే కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసి మాకు జీవనోపాధి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఐటిడిఎ స్పందించి పూర్తిస్థాయిలో ఎటువంటి ఆధారం లేని గిరిజన గ్రామాల్లోని ప్రజలకు సహాయ సహకారాలు అందించాలి.

- డి.జమ్మయ్య, గిరిజన సంఘ నాయకుడు, బంజీరుపేట


నౌపడ : దుస్తులు, సరుకులను పంపిణీ చేస్తున్న నాగరాజు

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- పలాస

పలాస కన్యకాపరమేశ్వరి ఆలయంలో వైశ్య సంఘం ఆధ్వర్యాన సోమవారం 300 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైశ్య సంఘం అధ్యక్షుడు మల్లా కృష్ణారావు, గౌరవాధ్యక్షులు మల్లా భాస్కరరావు, కార్యదర్శి తంగుడు వైకుంఠరావు మాట్లాడుతూ ఏటా నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంధవరపు రత్నబాబు, తంగుడు కామేశ్వరరావు, పట్నాన శ్రీనివాసరావు, కొత్తకోట తిరుమల, కోట్ని శ్రీదేవి, పుష్ప పాల్గొన్నారు.

రణస్థలం : మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీ దన్నానపేటలో సంక్రాంతి పండగ సందర్భంగా ఏటా మాజీ సర్పంచ్ దన్నాన అప్పలనాయుడు జ్ఞాపకార్థం ఉప సర్పంచ్ దన్నాన సీతారాం, వారి కుటుంబ సభ్యులు నిరుపేదలకు వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడలో సంక్రాంతి పండగ సందర్భంగా పేదలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేశారు. పలువురు గ్రామస్తులు బృందంగా ఏర్పడి ఒక్కొక్కరికీ రూ.1300 విలువ చేసే సరుకులను, దుస్తులను అందజేశారు. గ్రామస్తులు నడిమింటి నాగరాజు, పిలక రాజశేఖర్‌రెడ్డి, లోపింటి జయకృష్ణారెడ్డి, షావుకారి నర్సింగరావు, మేరువ కోదండరావు, అంధవరపు రమేష్ పాల్గొన్నారు.


శిథిలావస్థకు చేరుకున్న తహశీల్దార్ కార్యాలయం

భయపెడుతున్న భవనాలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పాడుబడిన ప్రభుత్వ భవనాలు ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి. మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయ భవనం, ఆయుర్వేదిక్, ఆస్పత్రి, సబ్ సెంటర్, వ్యవసాయ శాఖ కార్యాలయ భవనాలతో పాటు పోలీస్ క్వార్టర్స్ భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. అయితే వీటి స్థానంలో కొత్త భవనాలను నిర్మించడంతో ఈ భవనాలను విడిచి పెట్టేశారు. నిరుపయోగంగా భవనాలు ఉండటంతో పలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా భవనాలు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో విష సర్పాలు చేరిపోయాయి. అంతేకాకుండా రాత్రుల సమయాల్లో తమ ఇండ్లకు ప్రవేశిస్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందని ఆందోళన చెందుతున్నామని స్థానికులు వాపోయారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలను ఇలా విడిచిపెట్టకుండా సంబంధిత ఉన్నతాధికారులు ఈ భవనాలకు మరమ్మతులు జరిపి వినియోగంలోకి తీసుకురావాలని, లేని పక్షంలో వాటిని తొలగించాలని స్థానికుల కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరుకున్న వ్యవసాయ శాఖ కార్యాలయం

ఇసుక అక్రమార్కులకు పంట

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక కొందరికి రూ.లక్షలు సంపాదించుకుంటున్నారు. గతంలో ఇసుక అమ్మకాలు, తవ్వకాలు రవాణాపై మంచి అనుభవం సంపాదించిన వైసిపికి చెందిన కొంతమంది నేతలు ఇప్పుడు అధికారం లేకపోయినా అధికార పార్టీ నేతలకు ముందు పెట్టి వెనుక నుంచి కథంతా నడిపిస్తూ... జోరుగా ఇసుక వ్యాపారం చేస్తున్నారు. ఉచిత ఇసుక ఇప్పుడు అక్రమార్కులకు పంట పండింది. అక్రమంగా తరలిస్తున్నా, భారీగా నిల్వలు చేస్తున్నా అధికార యంత్రాంగం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అధికార పార్టీకి చెందిన కొంత మంది నేతల వల్లే అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బాహుదా నదిలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. చివరికి రైల్వే వంతెనకు అతి సమీపంలో కూడా ఇసుకాసురులు వదిలి పెట్టలేదు. ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణాపై పోలీస్‌శాఖకు సడలించడంతో ఉచిత ఇసుక అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ట్రాక్టర్ రూ.3 నుంచి రూ.5 వేలుకు అమ్మకాలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రకటన కేవలం ప్రకటనకే పరిమితం కావడంతో పేదలకు ఇసుక అందుబాటులోకి రావడం లేదు. పట్టణంలో శివారు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఇసుక కుప్పలు కుప్పలుగా నిల్వలు ఉంటున్నాయి. అధికారులు ఎవ్వరూ కుప్పలు, తెప్పలుగా ఉన్న ఇసుక నిల్వపై దాడులు చేపట్టకపోవడంతో పలు విమర్శలకు దారితీస్తున్నాయి. ఇప్పటికైనా ఇచ్ఛాపురంలో జరుగుతున్న ఇసుక దందా నిరోధించాలని కోరుతున్నారు.


బాహుదా నదిలో తవ్వుతున్న ఇసుక


రైలు పట్టాల మీదుగా మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్తులు

చివరి మజిలీ కష్టాలు

కంచిలి : మనిషి జీవన పోరాటంలో ఎన్నో ఒడిదుడుకులను, కష్టనష్టాలను అనుభవిస్తున్నాడు. అయితే మృతి చెందిన తరువాత మృతదేహాన్ని తరలించేందుకు సైతం అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. మండలంలోని ఎస్.ఆర్.సి.పురానికి చెందిన ప్రజలు తమ గ్రామంలో ఎవరైనా చనిపోతే వారి మృతదేహాన్ని శ్మశాన వాటికలో దహన సంస్కారం నిర్వహించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామం నుంచి శ్మశాన వాటికకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రమాదపు అంచనా రైల్వే పట్టాలను దాటుతూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో కొన్నిసార్లు ప్రమాదాలు సైతం జరిగినట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంచిలి మెయిన్ రోడ్డుకు అనుకొని ఉన్న ఎస్.ఆర్.సి.పురం, ఎస్.ఆర్.సిపురం కాలనీ ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని తీసుకొని రైల్వేలైన్ దాటి వెళ్లాల్సి వస్తుంది. ఎస్.ఆర్.పురం భౌగోళికంగా రైలు పట్టాలకు ఇరువైపులా ఉండడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇటువైపు వాళ్లు అటు వెళ్లాలంటే రైల్వే బ్రిడ్జిని దాటి వెళ్తుంటారు. అయితే మృతదేహాన్ని రైల్వే స్టేషన్‌లోపలి నుంచి తరలించేందుకు వీలు లేకపోవడంతో పట్టాల మీదుగా తీసుకెళ్తుంటారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు ఎస్.ఆర్.సి.పురానికి అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఏళ్ల తరబడి కోరుతూనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామంలోని 400 కుటుంబాలు కోరుతున్నాయి.

ఆ గ్రామాలు భోగికి దూరం

ప్రజాశక్తి - నౌపడ / పలాస / నరసన్నపేట

తెలుగు వారికి పెద్ద పండగ సంక్రాంతి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఇంటికి తీసుకొచ్చే సమయంలో నాలుగు రోజుల పాటు సంక్రాంతి పండగను జరుపుకోవడం సంప్రదాయంలా వస్తోంది. వరుసగా భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పండగలను నాలుగు రోజుల పాటు కుటుంబ సభ్యులతో సందడిగా జరుపుకుంటారు. వృత్తి, వ్యాపారులు, బతుకుతెరువు నిమిత్తం పలు ప్రాంతాల్లో ఎక్కడెక్కడో ఉన్నా సంక్రాంతి పండగకు రాని వారంటూ ఉండరు. అలాంటి మధురానుభూతులకు ఆలవాలమైన భోగి మంట వేడుకలకు కొన్ని గ్రామాలు తరతరాలుగా దూరంగా ఉంటున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో భోగి పండగను చేసుకోని గ్రామాలు ఇంచుమించు ఉండవు. చిన్నారుల నుంచి పెద్దల వరకు తెల్లవారుజామునే ఆవుపేడతో ప్రత్యేకంగా చేసిన భోగి పిడకలతో గ్రామంలోని ఓ ప్రత్యేక స్థలంలో ఏర్పాటు చేసిన భోగి మంటల వద్దకు చేరి సందడిగా గడుపుతారు. పిల్లల విషయానికొస్తే ఆ ముచ్చటే వేరు. వారి ఆనందాన్ని వర్ణించలేం. అయితే నరసన్నపేట మండలంలో పలు గ్రామాల ప్రజలు భోగి పండగే తెలియదు. భోగి మంటలు వేయరు.



ఆ గ్రామాల్లో...

నరసన్నపేట మండలం బాలసీమ పంచాయతీ బసివలస, ఉర్లాం పంచాయతీ చింతువానిపేట, వివిఎన్‌పురం పంచాయతీ గోకయ్యవలస, చోడవరం, సుందరాపురం గ్రామాల ప్రజలకు భోగి పండగ అంటే ఏమిటో తెలియదు. బసివలసలో వందేళ్ల కిందట జరిగిన ఘర్షణ నేపథ్యంలో భోగి పండగ నిషేధించామని గ్రామ ప్రజలు చెబుతున్నారు. ముక్కనుమ పండగ రోజు జరిగే కొమ్ముల (ఆవులను పూజించే) పండగ కూడా చేసుకోరు. చింతువానిపేటలో కూడా భోగి పండగను చేయరు. కారణం ఏమిటన్నది ఎవరికీ తెలియదు. వివిఎన్‌పురం పంచాయతీ గోకయ్యవలసలోనూ భోగి మంటలు వెలిగించరు.

ఆ గ్రామాలదీ అదే దారి

సంతబొమ్మాళి మండలంలో యమాలపేట, చెట్లతాండ్ర, నౌపడ పంచాయతీలోని పాలనాయుడుపేటలోనూ భోగి పండగ చేసుకోరు. భోగి మంటలు వేస్తే ఆ గ్రామాల్లో ఏదో ఒక వింత అనుభవాలు ఎదురవుతుందన్న ప్రచారం బాగా ఉంది. యామాలపేటలో పూర్వీకులు ఒకసారి భోగి మంట వేస్తే, గ్రామంలోని పూరిపాకలు అంటుకుని భారీ అగ్ని ప్రమాదం సంభవించిందని గ్రామస్తులు చెప్తున్నారు. అప్పట్నుంచి ఆ గ్రామంలో భోగి మంటలు వేయడం ఆపేశారు. దాన్నే నేటికీ కొనసాగిస్తున్నారు.

చెట్లతాండ్రలో పూర్వం భోగి మంటలు వెలిగిస్తే, దాని నుంచి వచ్చిన పొగ గ్రామ సమీపంలోని కొండ పైకి వెళ్లేది. ఆ పొగతో కొండపై ఉన్న పులి భయపడి గ్రామంలోకి చొరబడేదన్న ప్రచారం ఉంది. దీంతో గ్రామంలో భోగి మంట వేయడం మానేశారు. నౌపడ పంచాయతీ పాలనాయుడుపేటలోనూ భోగి మంటకు దూరంగా ఉన్నారు.

లక్ష్మీపురంలోనూ అదే పరిస్థితి

పలాస మండలం లక్ష్మీపురం గ్రామం కూడా కొద్ది సంవత్సరాలుగా భోగి పండగకు దూరంగా ఉంటోంది. కొన్ని సంవత్సరాల క్రితం గ్రామంలో భోగి మంటలు వేస్తుండగా ఎక్కడ నుంచో వచ్చిన జంతువు మంటలో పడిపోయి మృతి చెందినట్లు గ్రామస్తులు చెప్తున్నారు. అప్పట్నుంచి ఆ గ్రామంలో భోగి మంటలు ఆపేశారు. ఇవి అప్పట్లో యాదృచ్ఛికంగా జరిగినా, సాంకేతిక విజ్ఞానం పెరిగిన ప్రస్తుత రోజుల్లోనూ అటువంటి నమ్మకాలను ప్రస్తుత తరం పటాపంచలు చేయాల్సిన అవసరం ఉంది.

బియ్యం గింజపై స్వర్ణ సంక్రాంతి

పలాస : కాశీబుగ్గకు చెందిన సూక్ష్మ కళాకారుడు కొత్తపల్లి రమేష్ బియ్యం గింజపై బంగారు సంక్రాంతి లోగో తయారు చేశారు. బంగారు లోగోను 0.20 మిల్లీగ్రాములతో తయారు చేశానని, దీని తయారీకి సుమారు రెండు గంటల సమయం పట్టిందని రమేష్ తెలిపారు.













